

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.



Contact Number
9059328777



విజయవాడ శనివారం 5-09-2026 సంపుటి: 02 సంచిక : 65 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Saturday, 5-09-2026 Volume :02 Issue: 65 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani


## ఎల్‌నినో ఉగ్రరూపం..




- వచ్చే ఏడాది వాతావరణం భయానకం
- 2027లో తీవ్ర వాతావరణ పరిస్థితులకు అవకాశం
- ఎల్‌నినో బలపడుతోందని ఐరాస హెచ్చరిక
- 2027 ఫిబ్రవరి వరకు కొనసాగనున్న ఎల్‌నినో
- పసిఫిక్ సముద్రంలో పెరుగుతున్న నీటి ఉష్ణోగ్రతలు
- కరువులు, వరదలు, తుఫాన్ల ముప్పు
- పలు ప్రాంతాల్లో అడవుల్లో కార్చిచ్చుకు అవకాశం
- 2027లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు ఛాన్స్
- వాతావరణ మార్పులతో మరింత పెరగనున్న ముప్పు

### ఇస్రో జీఎస్ఎల్వీ–ఎఫ్17

## ప్రయోగం సక్సెస్




- నింగిలోకి దూసుకెళ్లిన నాటీ బాయ్..
- 2,367 కిలోల ఈఓఎస్-05 ఉపగ్రహం కక్ష్యలోకి
- రక్షణ, వ్యవసాయం, విపత్తుల నిర్వహణకు కీలకం
- సబ్-జీటీఓలోకి కచ్చితత్వంతో ఉపగ్రహ ప్రవేశం
- అత్యాధునిక ఇమేజింగ్ సామర్థ్యాలతో ఈఓఎస్-05
- స్వదేశీ క్రయోజెనిక్ ఇంజిన్ కీలక పాత్ర
- భూ పరిశీలన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనున్న ఉపగ్రహం
- వర్షంలోనూ ప్రయోగాన్ని వీక్షించిన 1,500 మంది సందర్శకులు



## కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ఊరట

- మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో కీలక ఉత్తర్వులు
- రేడియో గ్రాఫర్లకు ప్రత్యేక సెలవులు
- పీహెచ్‌సీల్లో సిబ్బంది సర్దుబాటు
- నర్సులపై 12 గంటల పని భారం తగ్గింపు
- పారామెడికల్ సిబ్బందికీ ఎన్టీఆర్‌వీఎస్‌టీ ప్రోత్సాహకాలు
- డిఎంఎల్‌టీ, బీఎస్సీ ఎంఎల్టీ విద్యార్థులకు క్లినికల్ శిక్షణ

అమరావతి,

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది సర్వీసు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తులపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్ బాబు సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు సమస్యలు,

-మిగతా 2 లో

### ఉద్యోగుల సమస్యలపై

# నేడు కీలక భేటీ

### సీఎం చంద్రబాబుతో ఉద్యోగ సంఘాల సమావేశం

- జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సమస్యలపై చర్చ
- పీఆర్సీ, పెండింగ్ డీఏలపై కీలక చర్చ
- సరెండర్ లీవ్, గ్రాట్యుటీ బకాయిలపైనా చర్చ
- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు
- ఉద్యోగులకు సానుకూల హామీలు ఇచ్చే అవకాశం
- ఆందోళనలకు ముగింపు పలికేలా నిర్ణయాలు

11 ఉద్యోగ సంఘాలకు ఆహ్వానం



అమరావతి,

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా గుర్తింపు పొందిన కూటమి సర్కార్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేదిగా చర్యలకు దిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా రంగంలోకి దిగి ఉద్యోగుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించేందుకు కార్యాచరణను సిద్ధం చేశారు. శనివారం ఉదయం 11 గంటలకు ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం జరుగనుంది. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 11 గుర్తింపు ఉద్యోగ సంఘాలను ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. ఒక్కో ఉద్యోగ సంఘం నుంచి ఒక ప్రతినిధిని హాజరయ్యేలా ఆహ్వానం పంపింది. ప్రధానంగా ఉద్యోగులు కొంత కాలంగా ఎదురుచూస్తున్న పీఆర్సీ, పెండింగ్ బకాయిలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరుగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్యోగ

-మిగతా 2 లో




## కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

- ఉగ్రవాది హతం
- బుద్గామ్‌లో భద్రతా బలగాల సంయుక్త ఆపరేషన్
- అఫ్తార్ గలీ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
- ఓ ఉగ్రవాది హతం.. ఏకే రైఫిల్ స్వాధీనం
- సైన్యం, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్త గాలింపు
- కచ్చితమైన నిఘా సమాచారంతో ఆపరేషన్
- ఘటనాస్థలంలో ఇతర యుద్ధ సామగ్రి స్వాధీనం
- మరో ఉగ్రవాది కోసం కొనసాగుతున్న గాలింపు
- హతమైన ఉగ్రవాది వివరాలు తెలియాల్సి ఉంది



### సైనిక విన్యాసాలకు సిద్ధమైన

## ఇండియన్ ఎయిర్‌ఫోర్స్

భారత్ సైనిక విన్యాసాలకు సిద్ధమవుతుండటంతో పాకిస్థాన్‌లో కలకలం మొదలైంది. రాజస్థాన్‌లో సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు 17 రోజుల పాటు విన్యాసాలు నిర్వహించేందుకు నోటమ్ జారీ అయింది. దీంతో పాక్ రక్షణ అధికారులు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సరిహద్దుల్లో నిఘా పెంచాలని ఆదేశించినట్లు సమాచారం.

02

- భారత్--పాక్ సరిహద్దులో 17 ని రోజులపాటు భారీ డ్రిల్స్
- సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు కొనసాగనున్న విన్యాసాలు
- ఎయిర్‌స్పేస్ ఆంక్షల కోసం నోటమ్ జారీ
- భారత సైనిక కదలికలపై పాక్ నిఘా
- సరిహద్దులో భద్రత పెంచాలని సైనిక అధికారుల ఆదేశాలు
- విన్యాసాలపై పాక్ రక్షణ శాఖ ఉన్నతస్థాయి సమీక్ష
- భారత వైమానిక దళం సంసిద్ధతపై పర్యవేక్షణ
- ఎయిర్‌స్పేస్ భద్రతకు ప్రత్యేక చర్యలు

### ఇటలీకి సుదీర్ఘకాల ప్రధానిగా మెలోనీ రికార్డు




### సురేఖను తప్పించడం

# బాధాకరం



### క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టీకరణ

- పార్టీలోనే కొనసాగాలని సురేఖను కోరుతున్నాం
- బహిరంగంగా మీడియాతో మాట్లాడటం క్షమించరాని తప్పిదం
- సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై అధిష్ఠానం ఆగ్రహం
- పార్టీ నియమాలను ఉల్లంఘించినందుకే కఠిన నిర్ణయం
- సీఎం రేవంత్‌కు బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదు
- పార్టీకి నష్టం కలిగించే వారిని హైకమాండ్ ఉపేక్షించదు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్

హైదరాబాద్,

: మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పించడం బాధాకరమైన విషయమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సురేఖ బర్తరఫ్ అంశంపై శుక్రవారం ఆయన స్పందించారు. పార్టీలో ఎవరైనా క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం నుంచి కఠిన చర్యలు తప్పవని స్పష్టంచేశారు. నాయకులకు తమ అభిప్రాయాలు, సమస్యలను చెప్పుకొనేందుకు పార్టీలో అంతర్గతంగా ఎన్నో వేదికలు ఉన్నాయని, వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటం క్షమించరాని

-మిగతా 2 లో




## నేడే భారత్ పాక్ పోరు

మహిళల ఆసియాకప్ సమరం
రాత్రి 8గం నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రసారం

- దుబాయ్‌లో చిరకాల ప్రత్యర్థుల సమరం
- వరుస విజయాలతో సెమీస్‌కు చేరిన భారత్
- హ్యాట్రిక్ విజయంపై హర్మన్‌ప్రీత్ సేన కన్ను
- థాయ్‌లాండ్, హాంకాంగ్‌పై ఘన విజయాలు
- హాంకాంగ్‌పై స్మృతి మంధాన విధ్వంసక సెంచరీ
- 124 పరుగులతో చెలరేగిన మంధాన
- గ్రూప్ టాపర్‌గా నిలవాలని టీమిండియా పట్టుదల
- భారత్-పాక్ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభం



## కేరళలో లోకేష్..

- కొల్లం జిల్లాలోని అమృతపురి ఆశ్రమం సందర్శన
- మాతా అమృతానందమయి ఆశీస్సులు అందుకున్న లోకేష్
- ఆశ్రమంలోని అమృత విశ్వ విద్యాపీఠాన్ని పరిశీలించిన వైనం
- ఈ పర్యటన వ్యక్తిగతమని, అధికారికం కాదని సమాచారం

అమరావతి,

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఇది పూర్తిగా లోకేష్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక కార్యక్రమం కాదని తెలుస్తోంది. అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమంలో లోకేష్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత

-మిగతా 2 లో

# ఇస్రో జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం సక్సెస్


- ౦ నింగిలోకి దూసుకెళ్లిన నాటీ బాయ్..
- ౦ 2,367 కిలోల ఈఓఎస్-05 ఉపగ్రహం కక్ష్యలోకి
- ౦ రక్షణ, వ్యవసాయం, విపత్తుల నిర్వహణకు కీలకం
- ౦ సబ్-జీటీఓలోకి కచ్చితత్వంతో ఉపగ్రహ ప్రవేశం
- ౦ అత్యాధునిక ఇమేజింగ్ సామర్థ్యాలతో ఈఓఎస్-05
- ౦ స్వదేశీ క్రయోజెనిక్ ఇంజిన్ కీలక పాత్ర
- ౦ భూ పరిశీలన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనున్న ఉపగ్రహం
- ౦ వర్షంలోనూ ప్రయోగాన్ని వీక్షించిన 1,500 మంది సందర్శకులు



శ్రీహరికోట:
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి శుక్రవారం తెల్లవారుజామున చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం విజయవంతమైంది. రెండో ప్రయోగ వేదిక నుంచి తెల్లవారుజామున 2.55 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్17.. ప్రయోగం జరిగిన సుమారు 18 నిమిషాల తర్వాత 3.13 గంటలకు 2,367 కిలోల బరువున్న ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని నిర్దేశిత సబ్-జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (సబ్-జీటీఓ)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. పెరిజీ 170 కిలోమీటర్లు, అపోజీ 28,934 కిలోమీటర్లుగా ఉన్న ఈ కక్ష్యలోకి ఉపగ్రహాన్ని కచ్చితత్వంతో చేర్చడంలో ఇస్రో శాస్త్రవేత్తలు సఫలమయ్యారు. సుమారు 51.7 మీటర్ల ఎత్తు, 420.5 టన్నుల బరువున్న జీఎస్ఎల్వీ-ఎఫ్17 ద్వారా చేపట్టిన జీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం. ప్రస్తుతం ఈఓఎస్-05ను సబ్-జీటీఓ నుంచి తుది జియోస్టేషనరీ కక్ష్యలోకి చేర్చే ప్రక్రియ కొనసాగనుంది. ఇందుకోసం ఉపగ్రహంలోని ఆన్‌బోర్డ్ ప్రొపల్షన్ వ్యవస్థను వినియోగించనున్నారు. ఈఓఎస్-05 అత్యాధునిక భూ పరిశీలన సామర్థ్యాలతో రూపొందించిన ఉపగ్రహం. ఇందులో అమర్చిన ఎంఎక్స్-వీఎన్ఆర్ పేలోడ్ అధిక స్పేషియల్ రిజల్యూషన్‌తో భూ పరిశీలనకు ఉపయోగపడనుంది. విస్తృత ప్రాంతాలను స్పష్టంగా చిత్రీకరించడంతో పాటు తక్కువ వ్యవధిలోనే చిత్రాలను అందించే సామర్థ్యం ఈ ఉపగ్రహానికి ఉంది. జియోసింక్రోనస్ కక్ష్యలో ఉండే ఈఓఎస్-05 భారత ఉపఖండాన్ని తరచుగా పర్యవేక్షించేందుకు దోహదపడనుంది. ఈ ఉపగ్రహం నుంచి లభించే చిత్రాలు రక్షణ రంగానికి ఎంతో ఉపయోగపడనున్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితులను పర్యవేక్షించడం, కీలక ప్రాంతాల్లో చోటుచేసుకునే మార్పులను గుర్తించడం వంటి అవసరాలకు ఈ డేటాను వినియోగించవచ్చు. వరదలు, తుపాన్లు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభావిత ప్రాంతాలను వేగంగా గుర్తించేందుకు కూడా ఉపగ్రహ సమాచారం ఉపయోగపడనుంది. సహాయక చర్యలు, రెస్క్యూ ఆపరేషన్లు, అత్యవసర ప్రణాళికలను మరింత సమర్థంగా రూపొందించేందుకు ఇది దోహదం చేయనుంది. వ్యవసాయ రంగంలోనూ ఈఓఎస్-05 కీలకంగా మారనుంది. పంటల పరిస్థితి, సాగు విస్తీర్ణం, భూమిలో తేమ, నీటి వనరుల స్థితి వంటి అంశాలను పర్యవేక్షించేందుకు ఉపగ్రహ డేటాను వినియోగించవచ్చు. వ్యవసాయ ప్రణాళికలు, నీటి నిర్వహణ, పంటల అంచనాల్లో ఇది ఉపయోగపడనుంది. అలాగే అడవుల విస్తీర్ణంలో మార్పులు, పట్టణ ప్రాంతాల విస్తరణ, భూ వినియోగంలో మార్పులు, సహజ వనరుల పరిస్థితిని దీర్ఘకాలంగా పర్యవేక్షించేందుకు కూడా ఈ ఉపగ్రహం దోహదపడనుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్17 మూడు దశల ప్రయోగ వాహకనౌక. ఇందులో అత్యంత క్లిష్టమైన స్వదేశీ క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ ప్రయోగ విజయానికి కీలకంగా నిలిచింది. ఈ దశ సమర్థంగా పనిచేయడంతో ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడం సాధ్యమైంది. స్వదేశీ క్రయోజెనిక్ సాంకేతికతపై ఇస్రో సాధించిన పట్టు మరోసారి నిరూపితమైంది. జీఎస్ఎల్వీ రాకెట్ గతంలో కొన్ని అనూహ్య ఫలితాలను ఎదుర్కొన్న నేపథ్యంలో దీనికి 'నాటీ బాయ్' అనే మారుపేరు వచ్చింది. 2021 ఆగస్టులో జీఎస్ఎల్వీ-ఎఫ్10 ద్వారా ప్రయోగించిన జీశాట్-1 ఉపగ్రహం నిర్దేశిత కక్ష్యను చేరుకోలేకపోయింది. అయితే ఆ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్న ఇస్రో.. సాంకేతికంగా మరింత మెరుగైన వ్యవస్థలతో చేపట్టిన తాజా ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. భారీ ఉపగ్రహాలను అధిక కక్ష్యల్లోకి ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని మరోసారి చాటుకుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు లాంచ్ వ్యూ గ్యాలరీకి సుమారు 1,500 మంది సందర్శకులు తరలివచ్చారు. తెల్లవారుజామున 2 గంటల నుంచే వర్షం కురుస్తున్నప్పటికీ వారు వెనక్కి తగ్గలేదు. వర్షంలో తడుస్తూనే రాకెట్ నింగిలోకి దూసుకెళ్లిన అద్భుత ఘట్టాన్ని వీక్షించారు. ఈఓఎస్-05 ప్రయోగం భారత భూ పరిశీలన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు రక్షణ, విపత్తుల నిర్వహణ, వ్యవసాయం, అటవీ, పర్యావరణ పర్యవేక్షణ వంటి అనేక రంగాలకు ఉపయోగకరమైన సమాచారాన్ని అందించనుంది. స్వదేశీ రాకెట్లు, క్రయోజెనిక్ సాంకేతికత, అధునాతన ఉపగ్రహ వ్యవస్థలతో అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతికి జీఎస్ఎల్వీ-ఎఫ్17 విజయం మరో నిదర్శనంగా నిలిచింది.

# కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

- -ఉగ్రవాది హతం
- -బుద్గామ్‌లో భద్రతా బలగాల సంయుక్త ఆపరేషన్
- -అఫ్తార్ గలీ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
- -ఓ ఉగ్రవాది హతం.. ఏకే రైఫిల్ స్వాధీనం
- -సైన్యం, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్త గాలింపు
- -కచ్చితమైన నిఘా సమాచారంతో ఆపరేషన్
- -ఘటనాస్థలంలో ఇతర యుద్ధ సామగ్రి స్వాధీనం
- -మరో ఉగ్రవాది కోసం కొనసాగుతున్న గాలింపు
- -హతమైన ఉగ్రవాది వివరాలు తెలియాల్సి ఉంది



లిశ్రీనగర్:
జమ్మూకాశ్మీర్‌లోని బుద్గామ్ జిల్లాలో భద్రతా బలగాలు చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో ఓ ఉగ్రవాది హతమయ్యాడు. అఫ్తార్ గలీ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఉగ్రవాదుల కదలికలపై అందిన కచ్చితమైన నిఘా సమాచారంతో భారత సైన్యం, జమ్మూకాశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. భద్రతా బలగాలకు అనుమానాస్పద కదలికలు కనిపించడంతో అక్కడ ఉన్నవారిని అప్రమత్తం చేశారు. దీంతో ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించగా, భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. ఘటనాస్థలంలో ఒక ఏకే రైఫిల్‌తో పాటు ఇతర యుద్ధ సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, హతమైన ఉగ్రవాది వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఇదే ప్రాంతంలో మరో ఉగ్రవాది దాక్కుని ఉండొచ్చన్న అనుమానంతో భద్రతా బలగాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి. కాశ్మీర్ లోయలో గత కొన్ని నెలలుగా ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# నేడే భారత్-పాక్ పోరు



దుబాయ్:
మహిళల ఆసియాకప్-2026లో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. నేడు దుబాయ్ వేదికగా చిరకాల ప్రత్యర్థులు భారత్-పాకిస్తాన్ మధ్య కీలక మ్యాచ్ జరగనుంది. గ్రూప్-ఎలో ఇప్పటికే వరుసగా రెండు విజయాలతో సెమీస్ బెర్తు ఖరారు చేసుకున్న టీమిండియా.. నేటి మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను కూడా మట్టికరిపించి హ్యాట్రిక్‌తో పాయింట్స్ టేబుల్ టాపర్‌గా గ్రూప్ దశను ముగించాలని పట్టుదలతో ఉంది. తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌ను 94 పరుగుల తేడాతో చిత్తు చేసిన హర్మన్‌ప్రీత్ సేన.. రెండో మ్యాచ్‌లో హాంకాంగ్‌పై 137 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది. దీంతో మరో మ్యాచ్ మిగిలుండగానే భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఓపెనర్ స్మృతి మంధాన 64 బంతుల్లోనే 14 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో ఏకంగా 124 పరుగులు చేసి విధ్వంసకర సెంచరీతో టీమిండియాకు అదిరే విజయాన్ని అందించింది. ఇక తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో పాక్‌పై కూడా అదే జోరు కొనసాగించాలని పట్టుదలతో ఉంది.

# కేరళలో లోకేష్..

మొదటి తరువాయి



ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమంలోని గజరాజులకు పండ్లు అందించారు. ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తినిచ్చిందని లోకేష్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా లోకేష్ అక్కడి విద్యాసంస్థలను కూడా పరిశీలించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న అమృత విశ్వ విద్యాపీఠంతో పాటు, అమృత ఆయుర్వేద కళాశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యాబోధన, మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యాపీఠాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఇటలీకి సుదీర్ఘకాల ప్రధానిగా మెలోనీ రికార్డు

- -1,413 రోజుల పదవీకాలంతో మెలోనీ రికార్డు
- -రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యధిక కాలం ప్రధాని
- -మెలోనీకి అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ
- -మోదీకి ధన్యవాదాలు తెలిపిన ఇటలీ ప్రధాని
- -భారత్-ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యంపై ఇరువురి ప్రశంసలు
- -రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం
- -మోదీ-మెలోనీ స్నేహం 'మెలోడీ'గా సోషల్ మీడియాలో ఫేమస్
- -భారత్-మధ్యప్రాచ్యం-యూరప్ కారిడార్‌పై కలిసి పనిచేయనున్న ఇరుదేశాలు



న్యూఢిల్లీ / రోమ్:
ఇటలీకి అత్యధిక కాలంగా పనిచేస్తున్న ప్రధానిగా జార్జియా మెలోనీ రికార్డు సృష్టించారు. మెలోనీ అక్టోబరు 22, 2022 నుంచి ఇటలీ ప్రధానమంత్రిగా పనిచేస్తున్నారు. గురువారం 1,413 రోజుల నిరంతర పదవీకాలం పూర్తయిన తర్వాత, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత దేశంలో అత్యధికకాలం నిరంతరం పనిచేసిన ప్రధానమంత్రిగా ఆమెనిలిచారు. గత రికార్డు సిల్వియో బెర్లుస్కోని పేరిట ఉండేది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మెలోనీని అభినందిస్తూ, ఇటలీ ప్రజలు ఆమె నాయకత్వంపై ఉంచిన నమ్మకం, విశ్వాసం ఈ మైలురాయిలో ప్రతిబింబిస్తోందని చెప్పారు. నా స్నేహితురాలు ప్రధానమంత్రి మెలోనీకి అభినందనలు అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆమెతో స్నేహం భారత్-ఇటలీ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిందని, రెండు దేశాల ప్రజలకు సమృద్ధి భవిష్యత్తు నిర్మించేందుకు సన్నిహిత సహకారం కొనసాగించాలని ఆయన అన్నారు. వచ్చే సంవత్సరాల్లో ఆమె విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. దీనికి స్పందనగా ధన్యవాదాలు ప్రియమైన ప్రధాని మోడీ అని మెలోనీ అన్నారు. ఎక్స్‌లో చేసిన పోస్టులో ప్రియమైన నరేంద్ర మోడీ, మీ మాటలకు, మీ స్నేహానికి ధన్యవాదాలు అని రాశారు. ఇటలీ-భారత దేశం సంబంధం ఈ రోజు ఎప్పటికంటే బలంగా ఉందని అన్నారు. మన చివరి సమావేశంలో ప్రారంభించిన ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం ఈ బంధం ప్రాముఖ్యతను, రెండు దేశాల నైపుణ్యాలను కలిపి, వృద్ధికి కొత్త అవకాశాలు సృష్టించాలనే సంకల్పాన్ని గుర్తిస్తుందని చెప్పారు. ముందున్న అసాధారణ సహకార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇటలీ, భారతదేశం కలిసి రెండు ఖండాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని, భారత్-మధ్యప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ అభివృద్ధికి కూడా కలిసి పనిచేస్తాయని విశ్వాసాన్ని మెలోనీ వ్యక్తం చేశారు. మోడీ-మెలోనీ స్నేహం సామాజిక మాధ్యమాల్లో 'మెలోడీ' అనే పేరుతో దృష్టిని ఆకర్షిస్తుంది. ఇటీవల రోమ్ పర్యటనలో మోడీ మెలోనీకి మెలోడీ చాక్లెట్ల ప్యాకెట్ బహుమతిగా ఇచ్చిన సందర్భం మళ్లీ చర్చనీయాంశమైంది. ఇరు నాయకుల స్నేహం ద్వైపాక్షిక సంబంధాలను మరింత లోతుగా చేస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.


# కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ఊరట

మొదటి తరువాయి

పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత, నర్సుల పని భారం, రేడియోగ్రాఫర్లకు ప్రత్యేక సెలవులు, పారామెడికల్ సిబ్బందికి ప్రోత్సాహకాలు తదితర అంశాలను సమీక్షించి పరిష్కార మార్గాలపై చర్చించారు. అనంతరం ఉద్యోగులకు ఊరటనిచ్చేలా పలు కీలక ఉత్తర్వులు జారీ చేశారు.
రేడియేషన్ ముప్పును ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ రేడియోగ్రాఫర్లు, రేడియో గ్రాఫిక్ టెక్నీషియన్లకు ప్రతి 11 నెలల విధి పూర్తయిన తర్వాత 30 రోజుల ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సెలవును సాధారణ లీవ్ ఖాతా నుంచి మినహాయించరాదని స్పష్టం చేశారు.
పారామెడికల్ సిబ్బందికీ ప్రోత్సాహకాలు
ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా శస్త్రచికిత్సలు, ప్రొసీజర్లకు అందే ప్రోత్సాహకాల్లో పాల్గొనే కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బందికీ క్యాడర్‌కు అనుగుణంగా వాటా ఇవ్వాలని ఆదేశించారు. స్టాఫ్ నర్సులు, ఓటీ టెక్నీషియన్లు, అనస్థీషియా టెక్నీషియన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు తదితరులను అర్హత మేరకు చేర్చాలని స్పష్టం చేశారు. ప్రతి నెల శస్త్రచికిత్సలు, పాల్గొన్న సిబ్బంది, వారికి అందే ప్రోత్సాహక మొత్తాల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని కమిషనర్ చక్రధర్‌బాబు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# సైనిక విన్యాసాలకు సిద్ధమైన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్..


- -భారత్--పాక్ సరిహద్దులో 17 రోజులపాటు భారీ డ్రిల్స్
- -సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు కొనసాగనున్న విన్యాసాలు
- -ఎయిర్‌స్పేస్ ఆంక్షల కోసం నోటమ్ జారీ
- -భారత సైనిక కదలికలపై పాక్ నిఘా
- -సరిహద్దులో భద్రత పెంచాలని సైనిక అధికారుల ఆదేశాలు
- -విన్యాసాలపై పాక్ రక్షణ శాఖ ఉన్నతస్థాయి సమీక్ష
- -భారత వైమానిక దళం సంసిద్ధతపై పర్యవేక్షణ
- -ఎయిర్‌స్పేస్ భద్రతకు ప్రత్యేక చర్యలు



ఇండియా సైనిక కార్యకలాపాలను ప్రారంభించిందంటే చాలు పాకిస్తాన్‌లో వణుకు ప్రారంభమవుతుంది. తాజా పరిణామాలే ఇందుకు ఉదాహరణ. భారత నావికాదళం త్వరలో సైనిక విన్యాసాలు నిర్వహించేందుకు నోటం (నోటీస్ టు ఎయిర్ మిషన్స్) జారీ చేసింది. నావికాదళానికి సంబంధించిన సైనిక విన్యాసాలకు సంబంధించిన ఏర్పాట్ల కోసం ఈ నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఇండియా-పాకిస్తాన్ సరిహద్దులో, రాజస్థాన్‌లో 17 రోజులపాటు నోటం జరగనుంది. సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు ఈ సైనిక విన్యాసాలు కొనసాగుతాయి. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను వాయుసేన విడుదల చేసింది. అయితే, మన ఎయిర్‌ఫోర్స్ సైనిక విన్యాసాలు చేసేందుకు సిద్ధమవుతుంటే పాకిస్తాన్ వణికిపోతోంది. పాకిస్తాన్ రక్షణ శాఖ అధికారులు ఆకస్మికంగా ఒక ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఇండియా చేపట్టనున్న సైనిక విన్యాసాలపై సమీక్ష నిర్వహించారు. ఇస్లామాబాద్‌లో ఉన్న భద్రతా దళాల చీఫ్ ఆధ్వర్యంలో ఈ సమీక్ష జరిగింది. ఇండియా-పాక్ సరిహద్దులో ఈ సైనిక విన్యాసాల వల్ల కలిగే పరిణామాలపై చర్చించారు. ఇదే సమయంలో భారత సరిహద్దులో నిఘా పెంచాలని అక్కడి సైనిక అధికారులు ఆదేశించారు. మన సైనిక విన్యాసాల్ని పాక్ సైన్యం నిరంతరం పర్యవేక్షించనుంది. భారత వైమానిక దళానికి సంబంధించి చేపట్టే మార్పులు, సంసిద్ధత, నిషేధాలు వంటి అంశాలపై విమాన ఆపరేటర్లు, సంబంధికులకు అందే రక్షణ నోటిఫికేషన్ నోటం. సైనిక డ్రిల్స్ నిర్వహిస్తున్నప్పుడు మామూలుగానే నోటం జారీ చేస్తుంటారు. ఎయిర్‌స్పేస్‌లో నిషేధాజ్ఞలు, భద్రత వంటివి దీని పరిధిలోకి వస్తాయి. 17 రోజులపాటు భారీ సైనిక విన్యాసాలు జరగనున్నాయి.

# ఎల్‌నినో ఉగ్రరూపం..

- ౦ వచ్చే ఏడాది వాతావరణం భయానకం
- ౦ 2027లో తీవ్ర వాతావరణ పరిస్థితులకు అవకాశం
- ౦ ఎల్‌నినో బలపడుతోందని ఐరాస హెచ్చరిక
- ౦ 2027 ఫిబ్రవరి వరకు కొనసాగనున్న ఎల్‌నినో
- ౦ పసిఫిక్ సముద్రంలో పెరుగుతున్న నీటి ఉష్ణోగ్రతలు
- ౦ కరువులు, వరదలు, తుఫాన్ల ముప్పు
- ౦ పలు ప్రాంతాల్లో అడవుల్లో కార్చిచ్చుకు అవకాశం
- ౦ 2027లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు ఛాన్స్
- ౦ వాతావరణ మార్పులతో మరింత పెరగనున్న ముప్పు




జెనీవా:
అతి పెద్ద ఎల్‌నినో రూపుదిద్దు కుంటోందని ఐక్యరాజ్య సమితి(ఐరాస) సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ హెచ్చరించారు. 2027లో తీవ్ర వాతావరణ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని అన్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) తాజా అంచనా ప్రకారం 2027 ఫిబ్రవరి వరకు ఎల్‌నినో కొనసాగే అవకాశం దాదాపు 100 శాతం ఉంది. ఇంత నిశ్చితంగా ఇంతకుముందు ఎప్పుడూ చెప్పలేదు. పసిఫిక్ మహాసముద్రంలో అసాధారణంగా పెరిగిన నీటి ఉష్ణోగ్రతల వల్ల ఎల్‌నినో మరింత బలపడుతోంది. 2026 చివరికి చాలా బలమైన స్థాయికి చేరుకుని తీవ్రస్థాయికి వెళ్తుందని అంచనా. దాని ప్రభావాలు 2027లో కూడా కొనసాగుతాయి. మన కళ్లముందే ఎల్‌నినో అతి పెద్దదిగా మారుతోందని గుటెరెస్ అన్నారు. శాస్త్రం సందేహానికి తావు ఇవ్వడం లేదు. భూగోళం ఇంతకుముందు చూడని జలాల్లో ఉంది, ఆ జలాలు వేడెక్కుతున్నాయి అని ఆయన చెప్పారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ప్రపంచ ఉష్ణోగ్రతలు పైకి వెళున్నాయి, ప్రపంచం తీవ్ర వాతావరణ ప్రమాద మండలంలో ఉందని హెచ్చరించారు. పెరుగుతున్న ప్రమాదాలు, ప్రజలను రక్షించే వాతావరణ చర్యల మధ్య పోటీ నడుస్తోంది, ఈ పోటీని గెలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎల్‌నినో ఉగ్రరూపం సమాజాలు, ఆర్థిక వ్యవస్థలపై పెద్ద దెబ్బ తీయగలదని డబ్ల్యూఎంఓ చీఫ్ సెలెస్టే సౌలో అన్నారు. కరువులు, వరదలు ఇప్పటికే అంతరాయం, విధ్వంసం కలిగిస్తున్నాయి. ఎల్ నినో బలపడిన కొద్దీ ఇవి మరింత తీవ్రమవుతాయని ఆమె చెప్పారు. మధ్య, తూర్పు భూమధ్యరేఖ పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి. ఇంకా పెరుగుతున్నాయి. నినో 3.4 సూచిక 2026 మే నుంచి జులై వరకు సగటున 1.5 డిగ్రీల సెల్సియస్ పైన ఉంది. అది జులైలో 2.0 డిగ్రీల సెల్సియస్ పైనకు చేరింది. సెప్టెంబరు నుంచి నవంబరు వరకు దాదాపు అన్ని భూభాగాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఎక్కువ. వర్షపాత నమూనాలు కూడా మారతాయి. కొన్ని ప్రాంతాల్లో కరువు, అడవుల్లో కార్చిచ్చు, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదలు, తుఫానులు రావచ్చు. 2027 సంవత్సరం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలను నమోదు చేసుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మానవ కారణాల వల్ల ఇప్పటికే పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై ఎల్‌నినో మరింత వేడిని జోడిస్తుంది.

# సురేఖను తప్పించడం బాధాకరం

మొదటి తరువాయి

తప్పిదమని ఆయన పేర్కొన్నారు. కొండా సురేఖ కుమార్తె చేసిన తీవ్ర వ్యాఖ్యలను కనీసం ఆమె ఖండించకపోవడాన్ని కాంగ్రెస్ హైకమాండ్ అత్యంత తీవ్రంగా పరిగణించిందని తెలిపారు.పార్టీ నియమాలను ఖాతరు చేయని వైఖరి కారణంగానే అధిష్ఠానం కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని మహేశ్‌కుమార్ వివరించారు. రాజకీయ లబ్ధి కోసం, ఒత్తిడి తేవడం కోసం ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం లేదని తేల్చిచెప్పారు. మంత్రి పదవి నుంచి తొలగించినప్పటికీ, కొండా సురేఖ పార్టీలోనే కొనసాగాలని తామంతా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని పేర్కొన్నారు. పార్టీ విధేయత, క్రమశిక్షణను కాపాడేందుకు అధిష్ఠానం ఈ కఠిన వైఖరి అవలంబించిందని, పార్టీకి నష్టం కలిగించేలా ఎవరు వ్యవహరించినా హైకమాండ్ చూస్తూ ఊరుకోదని మహేశ్‌కుమార్ స్పష్టంచేశారు.

# ఉద్యోగుల సమస్యలపై నేడు కీలక భేటీ

మొదటి తరువాయి


సంఘాల విజ్ఞప్తులు, డిమాండ్లను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ చర్చల్లో ఉద్యోగులకు కొన్ని హామీలు కూడా ఇచ్చే అవకాశం ఉందని ఉద్యోగ సంఘాలు భావిస్తున్నాయి.
ఉద్యోగ సంఘాల ఆందోళనకు స్వస్తి పలికేలా చర్యలు...
గత కొద్ది రోజులుగా కొన్ని ఉద్యోగ సంఘాలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనకు దిగాయి. అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో గత నెల 29 నుంచి ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయి. పీఆర్సీ, పెండింగ్ డీఏ బకాయిలు, సరెండర్ లీవ్‌తో పాటు విశ్రాంత ఉద్యోగుల గ్రాట్యుటీ మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం, మంత్రులు ఉద్యోగ సంఘాలతో ఇప్పటికే చర్చలు జరిపారు. అయినా అమరావతి జేఏసీలోని కొన్ని సంఘాలు ప్రభుత్వ ప్రతిపాదనలకు అంగీకరించకుండా ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఇదేసమయంలో అమరావతి జేఏసీ చేస్తున్న ఆందోళన కొంత వివాదానికి దారితీసింది. ఈనేపథ్యంలో ఈ సమస్యలన్నీ పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు స్వయంగా రంగంలోకి దిగారు. ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళన, అసంతృప్తికి చెక్ పెట్టేందుకు చర్చలకు ఆహ్వానించారు. దీంతో ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి, ఇతర అంశాలను సీఎం చంద్రబాబు స్వయంగా వివరించడంతోపాటు కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చే అవకాశం ఉంది. ప్రధానంగా పీఆర్సీ, పెండింగ్ డీఏలపై సానుకూల నిర్ణయాలను తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని డిమాండ్లను పరిష్కరించడం ద్వారా వారిలో ఉన్న అసంతృప్తికి కళ్లెం వేసి అసంతృప్తి విరమించేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ సమావేశంతో దాదాపు ఉద్యోగుల ఆందోళనకు తెరపడే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు.
నేడు సీఎం చంద్రబాబుతో జరిగే సమావేశంపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏవిధంగా స్పందిస్తారో, ఏయే సమస్యలు పరిష్కారం చూపుతారో, ఎలాంటి హామీలు ఇస్తారో అన్న ఆసక్తి ఉద్యోగ వర్గాల్లో నెలకొంది. పెండింగ్ డీఏలతో పాటు పీఆర్సీ, విశ్రాంత ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్న ఆశాభావంతో వారంతా ఉన్నారు.

**చర్చలకు ఆహ్వానం అందిన సంఘాలు ఇవే...**

ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగే సమావేశానికి గుర్తింపు పొందిన 11 ఉద్యోగ సంఘాలకు మాత్రమే ఆహ్వానం అందింది. ఏపీ ఎన్జీవో అసోసియేషన్, ఏపీ సచివాలయం అసోసియేషన్, స్టేట్ టీచర్స్ యూనియన్, ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్, యూనైటెడ్ టీచర్స్ ఫెడరేషన్, ఏపీ టీచర్స్ ఫెడరేషన్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయ్స్ అసోసియేషన్, ఏపీ ఉపాధ్యాయ సంఘం, నేషనల్ మజ్దూర్ యూనియన్, ఏపీ పీఆర్టీయూ ఎంప్లాయ్స్ యూనియన్ లకు ఆహ్వానం పంపారు. ఒక్కో సంఘం నుంచి ఒక్కో ప్రతినిధిని మాత్రమే ఈ సమావేశానికి అనుమతించారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు.

**ఆళ్లగడ్డ.సెప్టెంబర్ 4, ( నేటి దర్శిని )**
మండల పరిధిలోని హరినగరం గ్రామ సమీపంలో వెలసిన అహోబిలం ఇస్కాన్ టెంపుల్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం నిర్వహించిన ఈ వేడుకలు ఇస్కాన్ అహోబిలం ప్రాజెక్ట్ ఇంచార్జ్ చంద్ర కేశవ దాస్ ఆధ్వర్యంలో జరిగాయి. ఉదయం మంగళహారతి, తొలి దర్శనం మరియు ప్రత్యేక భజనలు, ఉట్ల ఉత్సవం, అన్న ప్రసాద వితరణ, డప్పుల భజన, శ్రీ

రాధా గోవిందులకు మహా శంఖాభిషేకం మహా హారతి 108 రకాల మహా నివేదన జన్మాష్టమి మహా ప్రసాద వితరణ, అనేక భక్తి సంకీర్తనలు వైష్ణవ భజన కీర్తనలు, శ్రీ ప్రభుపాద అభిషేకము, వ్యాస పూజ, ప్రవచనము, మధ్యాహ్నం హారతి, 56 రకాల వంటకాల నివేదన, నందనోత్సవ విందు భోజన వసతులు కల్పించారు. సాయంత్రం అనేక గ్రామాల నుంచి వచ్చిన యువకులకు ఉట్టికొట్టే పోటీని నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన యువకులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా నిర్వహించిన పలు సంస్కృతి కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ ఉత్సవాలకు అనేక గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు.

# కమ్యూనిటీ పోలీసింగ్‌కు నిదర్శనంగా కొక్కంటి క్రాస్‌లో 'వాక్ విత్ ఫ్రైడ్ అండ్ పీపుల్'



**తనకల్లుసెప్టెంబర్ 4, ( నేటి దర్శిని**
తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్ గ్రామంలో ప్రజలు, పోలీసుల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో 'వాక్ విత్ ఫ్రైడ్ అండ్ పీపుల్' కార్యక్రమం ఘనంగా జరిగింది. కదిరి రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ నాగేంద్ర, తనకల్లు సబ్ ఇన్ స్పెక్టర్ పి. దిలీప్ కుమార్, పోలీస్ సిబ్బంది, కదిరి సబ్ డివిజన్ శక్తి టీమ్ సభ్యులు గ్రామంలో ప్రజలతో కలిసి సుమారు 800 మీటర్లు నడిచారు. మార్గమధ్యంలో స్థానికులతో నేరుగా ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళలు, బాలల భద్రత, పోక్సో చట్టం, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, రాబోయే పండుగల సమయంలో పాటించాల్సిన భద్రతా నియమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. శ్రీ సత్యసాయి జిల్లా పోలీస్ శాఖ రూపొందించిన వివిధ అవగాహన వీడియోలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించి వివరించారు. ఈ ప్రదర్శనకు గ్రామీణుల నుంచి విశేష స్పందన లభించింది. ఇలాంటి కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల వల్ల ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకం పెరగడమే కాకుండా గ్రామాల్లో నేరాల నివారణ మరింత సులభమవుతుందని పోలీస్ అధికారులు తెలిపారు.



# శ్రీ మఠంలో కృష్ణాష్టమి వేడుకలు






**మంత్రాలయం సెప్టెంబర్ 4, ( నేటి దర్శిని )**
ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థుల అధ్వర్యంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. కృష్ణాష్టమి సందర్భంగా మఠం ఆవరణలో గురుసారభౌమ సంస్కృత పాఠశాల విద్యార్థులు ఊటి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు స్వయంగా ఉట్టి కొట్టి కొట్టి భక్తులను అలరించారు. శ్రీమఠం మేనేజర్ ఎస్ కే శ్రీనివాసరావు ఉట్టి కొట్టారు. మఠం అధికారులు, వేద పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు కూడా ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉల్లాసంగా పాల్గొన్నారు. మంత్రాలయంలో పుర ప్రజలు తమ పిల్లలకు శ్రీకృష్ణుని వేషధారణతో శ్రీమఠానికి తీసుకొచ్చి రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# నిమజ్జన ఏర్పాట్లు పక్కాగా చేయాలి

**- యల్లమరాజు చెరువును పరిశీలించిన కోడూరు రూరల్ సీఐ, చిట్వేల్ ఎస్ఐ**

**చిట్వేల్ సెప్టెంబర్ 4, ( నేటి దర్శిని )**
వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పక్కాగా చేయాలని కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం చిట్వేల్ ఎస్ఐ ఎస్. వినోద్‌కుమార్‌తో కలిసి యల్లమరాజు చెరువును పరిశీలించారు. వినాయక చవితి సందర్భంగా చిట్వేల్ మండలంతో పాటు పెనగలూరు మండలంలోని కొన్ని ప్రాంతాల నుంచి సుమారు 100 వరకు వినాయక విగ్రహాలను యల్లమరాజు చెరువులో నిమజ్జనం చేసే అవకాశం ఉందని సీఐ తెలిపారు. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వాహనాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. నిమజ్జన ప్రాంతంలో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని, చెరువులోని పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం, ఇతర



అవరోధాలను తొలగించి శుభ్రం చేయాలని సూచించారు. భక్తులు నిమజ్జనం సమయంలో ప్రమాదాలకు గురికాకుండా అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగా భక్తుల రద్దీని నియంత్రించడం, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయడం వంటి అంశాలపై ముందుగానే చర్యలు తీసుకోవాలని సీఐ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, ఫైర్ తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని సీఐ కోరారు.

# ఉరుకుందు ఈరన్న స్వామి భక్తులకు రైల్వే కష్టాలు

**-భక్తులకు పంచి ఉన్న ప్రమాదాలు**
**-భక్తులకు కష్టాలు ఎప్పుడు తీరేను**



**మంత్రాలయం సెప్టెంబర్ 4, ( నేటి దర్శిని )**
: కర్నూలు జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కౌతాళం మండలంలో కొలువైన లక్ష్మీ నరసింహ స్వామి ( ఉరుకుంద వీరన్న స్వామి) ఆలయానికి వెళ్లెందుకు భక్తులకు రైలు కష్టాలు తప్పడం లేదు. శ్రావణమాసంలో స్వామివారిని దర్శించుకునేందుకు దేశం నలమూలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వివిధ రకాల వాహనాల్లో వస్తుంటారు. కానీ భక్తులకు కోసిగి నుంచి ఆలయానికి వెళ్ళేందుకు రైల్వే గేట్ ఉండడం వల్ల నిత్యం భక్తులకు కష్టాలు తప్పడం లేదు. తరాలు గడిచినా ఫ్లైఓవర్ నిర్మించడంలో నాయకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులకు నిత్యం నరకమనుభవిస్తున్నారు. శ్రావణమాసంలో సోమవారాలు, గురువారాల్లో లక్షలాదిమంది భక్తులు ఆలయానికి చేరుకుంటారు. కోసిగి గ్రామంలో ఉన్న రైల్వే గేట్ ఉండడంతో ప్రతి అరగంటకు ఒకసారి, గంటకొకసారి రైళ్లు రాకపోకలు సాగిస్తుండటంతో గేటు వేస్తారు. రైల్వే గేట్ కు అవతల, ఇవతల వందలాది వాహనాలు నిలిచిపోతుంటాయి. ఇక్కడ ట్రాఫిక్ జమవుతుంది. అలాగే రైల్వే వెళ్లిన వెంటనే గేటు తీయడంతో భక్తులు హడావిడిగా బయలుదేరడంతో ప్రమాదాలు కూడా నిత్యం జరుగుతూనే ఉంటాయి. కానీ అధికారులు కానీ నాయకులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదని భక్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా నాయకులు ప్రభుత్వ అధికారులు స్పందించి భక్తులకు రైల్వే గేటు కష్టాలు తీరేలాగా ఫ్లైఓవర్ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని భక్తులు కోరుకుంటున్నారు. మరి నాయకులు, అధికారులు స్పందిస్తారో వదిలేస్తారో వేచి చూడాలి మరి.

# వాడవాడలా ఉత్సాహంగా,ఘనంగా నిర్వహించిన కృష్ణాష్టమి పర్వదిన వేడుకలు


**తాళ్లరేవు సెప్టెంబర్ 4, ( నేటి దర్శిని )**
కాకినాడ జిల్లాలోని అన్ని మండలాల్లోనూ వాడవాడలా కృష్ణాష్టమి పర్వదిన వేడుకలు ఉత్సాహంగా,ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాలు ధరించి,కృష్ణ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలోనూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉట్టిని కొట్టేందుకు,కార్యక్రమాన్ని తిలకించేందుకు చిన్నపిల్లల మొదలు వృద్ధుల వరకు ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా తాళ్లరేవు



మండలం గాడిమొగ గ్రామంలో గల రాధాకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రముఖులతో పాటు ప్రజలు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గాడిమొగ గ్రామపంచాయతీ మాజీ ఉప సర్పంచి కొక్కిలిగడ్డ లోకేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు నీటి విడుదల

**నందికొట్కూరు,సెప్టెంబర్ 4, ( నేటి దర్శిని )**
నంద్యాల జిల్లా పగిద్యాల మండలంలోని ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కెనాల్‌కు శనివారం ఉదయం నీటిని విడుదల చేయనున్నట్లు నంద్యాల ఎంపీ, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు.



రాష్ట్రంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపీ శబరి పేర్కొన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వేసవితో పాటు అవసరమైన సమయాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కెనాల్‌కు నీటి విడుదల నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలకు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీ శబరి అన్నారు. తాగునీటి అవసరాలతో పాటు సాగునీటి అవసరాలకు కూడా ఈ నీటి విడుదల కొంతమేర ఉపశమనం కలిగించనుందని పేర్కొన్నారు. ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆమె తెలిపారు.

# ఏపీటీఎఫ్ టోర్నమెంట్ విజేత కణేకల్ జట్టు

**ఉరవకొండ రూరల్, సెప్టెంబర్ 4, ( నేటి దర్శిని )**
ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఏపీటీఎఫ్ ఉరవకొండ జూన్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్




ఫైనల్ మ్యాచ్లో విడపనకల్లు జట్టుపై కనేకల్ జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కనేకల్ జట్టు 142/4 పరుగులు చేసింది. లక్ష్యఛేదన లో విడపనకల్లు జట్టు 84/6 చేసింది. 68 పరుగులతో కనేకల్ జట్టు విజయం సాధించింది. ఈ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కార్యదర్శి గౌని పాతిరెడ్డి హాజరై, విజేత జట్టుకు ట్రోఫీని అందజేశారు. ఈ ఆయన మాట్లాడుతూ ఇలాంటి పాటలు ఉపాధ్యాయులకు మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేసి ఏపీటీఎఫ్ ఉరవకొండ జోన్ ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఓబన్న, రాష్ట్ర కౌన్సిలర్లు శ్రీనివాసులు, వెంకటేశులు, జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు కే టి రంగ ప్రసాద్, సీనియర్ ఉపాధ్యాయులు తిమ్మప్ప రాజేష్ ధనుంజయ, నజీర్ అహమ్మద్, మునిస్వామి, లోకేష్, చంద్ర, రవీంద్ర, ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూర్, కనేకల్ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


# ఓటర్ల జాబితాలో అభ్యంతరాలపై గ్రామ సభలు నిర్వహణ

**తాళ్లరేవు, సెప్టెంబర్ 4, ( నేటి దర్శిని )**
ముసాయిదా ఓటర్ల జాబితాలో ఎస్సీ ఎస్టీ బీసీ ఓటర్ల జాబితా గ్రామ పంచాయతీ కార్యాలయములలో ఆగస్టు నెల 26న ప్రచురించారు. ప్రచురించిన ఓటర్ల జాబితాలో




అభ్యంతరాలపై కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పటవల, సుంకరపాలెం,జార్జిపేట గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారి వి జె వి రమణ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఏ.రామరాజు, వల్లిబాబా,దానం సీత శ్రీలక్ష్మి, గ్రేడ్-5 కార్యదర్శులు శ్యామ్, సతీష్,వంశీ నాయకులు గుత్తుల సూర్యనారాయణ, కొత్తూరి కాశీ,దంగేటి అవినాష్ ,భజన సత్తిబాబు, దోనం శ్రీనివాసరావు,వాసం శెట్టి గోవిందు, రెడ్డి సుబ్రహ్మణ్యం, కొటికలపూడి చందు, ప్రజలు, పంచాయతీ సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తొలిసారి 'హారర్ కామెడీ' బాటలో మాస్ మహారాజా




బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలైతే ఎలా ఉంటుందో మాస్ మహారాజా రవితేజ మరోసారి నిరూపించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘనవిజయం సాధించి థియేటర్లలో కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఈ చిత్రం తాజాగా రూ. 200 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. ఈ బ్లాక్‌బస్టర్ విజయాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ సైతం అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. సినిమా ఆరంభంలో బేబీ నక్షత్ర, రవితేజ, ప్రియా భవానీ శంకర్‌లపై చిత్రీకరించిన అన్‌సీన్ స్టిల్‌ను చిత్ర దర్శకుడు శివ నిర్వాణ పంచుకుంటూ సక్సెస్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న రవితేజ, తన భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో వేగాన్ని పెంచడమే కాకుండా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే సరికొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఎప్పుడూ రొటీన్ మాస్, కమర్షియల్ ఫార్ములాకే పరిమితం కాకుండా, కెరీర్‌లోనే మునుపెన్నడూ చేయని వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ సరికొత్త ప్రయాణంలో భాగంగా టాలీవుడ్‌లో వైవిధ్యమైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయతో రవితేజ చేతులు కలిపారు. 'సరిపోదా శనివారం' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వివేక్ ఆత్రేయ సిద్ధం చేసిన కథ రవితేజను అమితంగా ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రవితేజ తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎన్నడూ టచ్ చేయని 'హారర్ కామెడీ' జోనర్‌లోకి తొలిసారిగా అడుగుపెడుతుండటం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణంగా మాస్ యాక్షన్, ఫ్యామిలీ డ్రామా, క్రైమ్ థ్రిల్లర్లతో పాటు పక్కా ఎంటర్‌టైనర్లలో రవితేజ తన మార్క్ చూపించారు. అయితే ప్రేక్షకులను భయపెడుతూనే కడుపుబ్బా నవ్వించే హారర్ కామెడీ తరహా పాత్రను ఆయన ఇంతవరకు చేయలేదు. వివేక్ ఆత్రేయ మార్క్ విలక్షణమైన స్క్రీన్‌ప్లే, రవితేజ అసమానమైన ఎనర్జీ, టైమింగ్ తోడైతే వెండితెరపై నవ్వుల విందు గ్యారెంటీ అని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. లక్ష్మణ్, శ్రీని సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉంది. వివేక్ ఆత్రేయ చిత్రంతో పాటే మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను కూడా రవితేజ ఖరారు చేశారు. 'రాజ రాజ చోర', 'స్వాగ్' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో ఓ అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్ తెరకెక్కనుంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు (శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్) నిర్మిస్తున్న ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు మరో ప్రధాన పాత్రలో సందడి చేయనున్నారు. రవితేజ మార్క్ జోష్‌కు శ్రీవిష్ణు పంచ్‌లు జతకలిస్తే వినోదం ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ మల్టీస్టారర్ చిత్రాన్ని 2027 సంక్రాంతి పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. మొత్తానికి హసిత్ గోలి సినిమా పూర్తి కాగానే వివేక్ ఆత్రేయ హారర్ కామెడీ సెట్స్‌పైకి వెళ్లనుంది.

# సంక్రాంతి రేసులో 'కాకా'.. హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్!



టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మరోసారి రికార్డులను తిరగరాసేందుకు మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ (కె.ఎస్. రవీంద్ర) మరో అడుగు ముందుకు వేస్తున్నారు. వీరిద్దరి కలయికలో ఇప్పటికే వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'వాల్తేరు వీరయ్య' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ కాంబోలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా' సినిమాకు సంబంధించిన కీలకమైన షూటింగ్ అప్‌డేట్‌ను చిత్రబృందం వెల్లడించింది. ఈ భారీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన తదుపరి కీలక షెడ్యూల్ సెప్టెంబర్ 7వ తేదీ నుంచి హైదరాబాద్ వేదికగా ప్రారంభం కానుంది. ఈ తాజా షెడ్యూల్‌లో సినిమాలోని కొన్ని ముఖ్యమైన సన్నివేశాలతో పాటు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కించడానికి దర్శకుడు బాబీ ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత వెంకట్ నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎక్కడా రాజీ పడకుండా నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలు మరియు షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేస్తున్న మేకర్స్, ఈ సినిమాను 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి కొత్త లుక్‌లో కనిపించబోతున్న ఈ చిత్రంలో ఆయనతో పాటు నటి అనస్వర రాజన్, నివేతా పేతురాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



చీరకట్టులో బాపు బొమ్మలా..

# గాయం కూడా మంచికే!



'ఒక్కోసారి చెడు కూడా మంచే చేస్తుంది. 'మైసా' షూట్‌లో తగిలిన గాయం ఓ విధంగా నాకు మంచే చేసింది' అంటూ ఆనందం వెలిబుచ్చారు అగ్ర కథానాయిక రష్మిక మందన్నా. తాజాగా తన గాయం గురించి రష్మిక మాట్లాడుతూ 'పెళ్లయితే అయ్యిందికానీ.. సినిమా కమిట్‌మెంట్ల కారణంగా కలిసి ఉండే సమయం మాత్రం మాకు కరువైంది. పెళ్లి జరిగాక మూడునెలల పాటు మేమిద్దరం ఒకరినొకరం చూసుకోలేదంటే నమ్ముతారా!? కేవలం ఫోన్లలోనే మాట్లాడుకునేవాళ్లం. మా అవస్థ చూసి విధికి కూడా బాధ కలిగినట్టుంది. దాంతో నాకు విశ్రాంతి ఇద్దామని ఫిక్స్ అయ్యింది. అందుకే ఈ గాయమైంది కావొచ్చు. వినడానికి వింతగా అనిపించినా.. ఈ సమయం మాత్రం నాకు చాలా నచ్చింది. ఈ నెలరోజులూ ఇద్దరం ఇంట్లోనే హాయిగా గడిపాం. 'ఎలాంటి గాయాలూ లేకుండా మనం ఇలా ఎన్నో రోజులు గడపాలి' అని విజయ్ అనేవాడు. తను ఆటపట్టిస్తుంటే నాకెంతో ఆనందంగా ఉండేది. ఈ విశ్రాంతి రోజులన్నీ నాకు అద్భుతమైన జ్ఞాపకాలుగా నిలిచిపోయాయి. నాకు కొరియన్ డ్రామాలంటే పిచ్చి. విజయ్‌కేమో సీరియస్ డ్రామాలు, షోలు ఇష్టం. ఈ ఖాళీ టైమ్‌లో ఇద్దరం కలిసి రెండూ కవర్ చేశాం' అంటూ సరదాగా చెప్పుకొచ్చారు రష్మిక. ఇదిలావుంటే.. గాయం నుంచి కోలుకున్న రష్మిక తిరిగి మళ్లీ షూటింగ్స్‌తో బిజీ కానున్నారు. ఇప్పటికే ముగింపు దశలో ఉన్న 'మైసా' చిత్రాన్ని ఆమె పూర్తి చేయనున్నారు. నవంబర్ 27న పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానున్నది. ఇక తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి ఆమె నటిస్తున్న 'రణబాలి' అక్టోబర్ 16న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న విషయం తెలిసిందే

# కమల్‌హాసన్ కొత్త సినిమా



గత ఏడాది విడుదలైన 'థగ్ లైఫ్' తర్వాత అగ్ర నటుడు కమల్‌హాసన్ కొత్త సినిమా పట్టాలెక్కలేదు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రజనీకాంత్‌తో కలిసి ఓ మల్టీస్టారర్ సినిమా ప్రకట జరిగింది. దాంతో పాటు స్టంట్ మాస్టర్ అన్బరివ్ దర్శకత్వంలో కూడా కమల్‌హాసన్ ఓ సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అయితే ఇప్పటివరకు ఈ రెండు చిత్రాలు ప్రకటనల వరకే పరిమితమై పోయాయి. ఈ నేపథ్యంలో అభిమానుల్ని సర్‌ప్రైజ్ చేస్తూ ఎస్.యు.అరుణ్‌కుమార్ దర్శకత్వంలో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు కమల్‌హాసన్. గురువారం కమల్‌హాసన్ లుక్ టెస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో చేతిలో ఆయుధాన్ని ధరించి పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. యాక్షన్ ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని ఫస్ట్‌లుక్‌ని చూస్తే అర్థమవుతున్నది. 'సేతుపతి' 'చిత్తా' చిత్రాలతో తమిళంలో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు దర్శకుడు ఎస్.యు.అరుణ్‌కుమార్. తాజాగా ఆయన కమల్‌హాసన్‌ను డైరెక్ట్ చేయడం తమిళ సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుందని మేకర్స్ తెలిపారు. రాజ్‌కమల్‌ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకాలపై కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450